నానీ కళ్ళు నీటి కుండలుగా మారుతున్నాయి. అప్పటికే తవిటయ్య కొన్ని కట్టెల్ని పేర్చాడు.

మరో అరక్షణంలో ఆ శవాన్ని కట్టెలపై వుంచిన తవిటయ్య ఇక చితికి నిప్పంటించేలోగా....

అప్పుడు దూసుకొచ్చాడు నానీ"నువ్వు చెడ్డ తాతయ్యావి"

అంతదాకా నానీ సంగతే మరిచిన తవిటయ్య "ఏంటయ్యా, ఇదిక్కడ మామూలే" అన్నాడు.

నానీకి ఆ మాట మరింత ఉక్రోషాన్ని కలిగించింది.

"చచ్చినోళ్లని కాలుస్తావు కాని చంపబడిన వాళ్లనీ ఇలాగే కాల్చేస్తారా.... అదన్నమాట" అంతకన్నా తన ఆలోచనల్ని ఎలా వ్యక్తం చేయాలో నానీకి తోచలేదు.

"నీ కెలా తెలుసు" ఆశ్చర్యంగా చూశాడు ఈ పసివాడు ఇదంతా ఎలా గ్రహించాడో అర్థంకాక.

"అనసూయ మంచి అమ్మ కదా!"

ఈ స్త్రీని ఎవరనుకుంటున్నాడీ పసికందు, మంచి అమ్మంటాడేమిటీ?

అప్పుడు చెప్పాడు నానీ తనకు నీడ నిచ్చి అమ్మలాగే గోరుముద్దలు తినిపించి లాలించిన అనసూయ గురించి తనను కాపాడుతూనే ప్రాణాలు వదిలిన ఆ శవం గురించీ.

"ఇలాగ మంచోళ్లని కాల్చేస్తే నీకు పాపం కదా?"

తవిటయ్యకు ఆ క్షణం బోధపడలేదు నానీకి ఎలా నచ్చచెప్పాలో.

"అక్కడ నీ లోకంలో బతికే వాళ్ళకి బతికున్న మనుషులతో పనైతే నాలాటోళ్ళకి చచ్చిన శవాలతోనే పనుంటాదయ్యా. అది నా బ్రతుకు మరి".

"మా తాతయ్య ఇలాగ మాట్లాడడు" మేరులాంటి తాతయ్య ఆకారం, పదుగురిచేత ఆరాధింపబడే వ్యక్తిత్వం కళ్ల ముందు కదలాడింది ఓ క్షణం "అమ్మని నాన్న చంపినప్పుడు ఎంత ఏడ్చాడని... నాన్న కన్నా మా అమ్మే మంచిదంటాడు. ఇలాంటప్పుడైతే పోలీసుల్ని పిలిచే వాడన్నమాట".

"హరి సంగతి నీకు తెలీదయ్యా.... పోలీసులొచ్చినా అతగాడ్నేం చేయరు. కాని నిజం సెబితే మాత్రం హరి నా పేనాలు తీస్తాడు."

"నీకు చచ్చిపోతానని భయ్యమా?"

చెళ్ మనిపించింది ఆ ప్రశ్న.

"నా లాంటి చిన్న పిల్లలు భయపడతారుగాని తాతయ్యలూ భయపడతారా!"

'కాటికి కాళ్ళు చాపుక్కూచున్న నీ కెందుకయ్యా బ్రతుకు ఆరాటం' అనిపించే మరో అస్త్రం సంధించాడు నానీ అమాయకంగానైనా....

"బామ్మ చచ్చిపోయిందన్నావు..... మరేమో నీ కొడుకు చచ్చిపోయాడన్నావు

నువ్వెప్పటికీ బతికే వుంటావా అలాగైతే?".

"నాకు చెప్పడం రాదుగానీ ఇలాంటప్పుడు తాతయ్యయితే నీకు ఇంకా మంచి మాటలు చెప్పేవాడన్నమాట.... అప్పుడు మా వూళ్ళో సన్యాసిరావు తప్పు చేస్తే శ్లోకం చెప్పాడు. నేనది చెబితే నీకు అర్థం కాదు గానీ, నిజాన్ని కాల్చేయడం నిన్ను నువ్వు తగలబెట్టుకోవడం లాంటిది అని.... అప్పుడే మనిషికి అపకీర్తి కంటే పెద్ద చావు లేదని కూడా అన్నాడన్న మాట."

ఇప్పుడిప్పుడే పలుకనేర్చిన పసికందని ఇందాక అనిపించిన బాలుడు ఇప్పుడు గీత నుపదేశించే శ్రీ కృష్ణుడైపోయాడు.

ఇన్ని మాటలు ఆ వృద్దుడు ఎప్పుడు వినలేదు.

నిస్త్రాణగా నేలపై చతికిలబడ్డాడు తవిటయ్య. ఇప్పుడు మంచి తాతయ్యనిపించాడు.

"తాతా" చేతులతో చుట్టేసిన నానీ కళ్లలో మసక వెల్తురు జార్చుతున్న నీటిధారలు "నీకు కూతురుందా".

ఎక్కడో సుఖంగా కాపురం చేసుకుంటున్న కూతురు జ్ఞప్తికి రాగా తలూపాడు నెమ్మదిగా.

"నిన్ను 'తాతయ్యా' అని నేను పిలిచినప్పుడు నీ కూతురు నాకు అమ్మ అవుతుందిగా."

ఇక దాగని కన్నీళ్లు తవిటయ్య చెంపల పైకి జారాయి-

"అలాంటప్పుడు నేను "అమ్మా' అని పిలిచిన అనసూయ నీకు కూతురే అన్న మాట, అవునా...."

నానీ గెలుపుకి సంకేతంగా తవిటయ్య చేతిలోని అగ్గిపెట్టె జారిపోయింది.

ఇక్కడ 'నిజం' హోమంలో సమిథ కాలేదు.

కాలిపోవాల్సిన 'నిజం' హిమజ్వాలై తవిటయ్య గుండెను చుట్టుకుంది.

-----

అప్పుడు సమయం తెల్లవారుజామున మూడున్నర కావస్తూంది.

'సర్...." యశస్వి ఏదో చెప్పబోయాడు.

"వెంటనే యిక్కడనుంచి వెళ్లకపోతే ఒక ప్రభుతోద్యోగి తన విధి నిర్వహించకుండా ఆటంకపరుస్తున్న నేరానికి నిన్ను ఐ.పి.సి. 332 అండ్ 315 సెక్షన్ ప్రకారం లోపలికి నెట్టాల్సి వుంటుంది. ఐ థింగ్ యూ ఆర్ క్లెవరెనఫ్ టు అండర్ స్టాండ్ దిస్."

"కమాన్" నిశ్శబ్దంగా నిలబడ్డ యశస్విని రామసూరి బలవంతంగా బయటకి లాక్కుపోతుండగా లోపలికి వచ్చాడు ఒక వృద్ధుడు.

"ఎవర్నువ్వు" అడిగాడు డి.ఎస్పీ సుందర్.

"పేరు తవిటయ్య బాబూ, కాటికాపర్ని."

ద్వారం దాటుతున్న రామసూరి, యశస్వి ఆగారు.

"ఓ ఆడమనిషిని సంపి తెల్లరేసరికల్లా కాల్చేయమని సెప్పెళ్ళాడు హరిబాబు... ఆ పని సెయ్యలేక...."

సుందర్ మొహం వివర్ణమవడం స్పష్టంగా గ్రహించాడు రామసూరి.

పక్కజేబులోని బాటిల్ తీసి గడగడా రెండుచుక్కలు తాగేసిన రామసూరి దూరం నుంచే నవ్వుతూ చూశాడు డి. ఎస్.పి సుందర్‌ని.

“ఇది తప్పదండీ ఎస్. పి. గారూ! చివరి సాక్షి ముందు నిలబడ్డాడు. వ్యవహారమంతా నా మైండ్‌లో రికార్డయిపోయింది. వెంటనే శవాన్ని కలెక్ట్ చేసుకోండి.
ఎలాగూ ఈ వార్త పత్రికల్లో కెక్కుతుంది కాబట్టి”.

“గెటౌట్” సుందర్ కేకతో ఆ పోలీస్ స్టేషన్ ప్రతిధ్వనించి పోయింది.

** ** ** **

“ఇదీ ఘనతవహించిన ఈ డిపార్టుమెంటు పరిస్థితి” బాటిల్లో మిగిలిన లిక్కర్‌ను ఖాళీ చేస్తూ అన్నాడు రామసూరి .

పోలీస్ స్టేషన్ నుంచి ఓ ఫర్లాంగు దూరందాకా నడిచిన యశస్వి, రామసూరి ఇప్పుడు ఒక చిన్న ఉడిపి హోటల్లో కూచుని వున్నారు.

అప్పటికే తెల్లారిన సూచనగా రోడ్లపై కొద్దిగా జనసంచారం మొదలయింది.

“ఇప్పుడేం చేద్దామని” యశస్వి అడిగాడు.

“నీకు తెలీదు యశస్వీ! ఈ డి.ఎస్.పి సుందర్ వున్నాడే హోం మినిష్టర్ అప్పారావుకి చాలా కావల్సినవాడూ.... రేపో మాపో రావల్సిన ప్రమోషన్ కోసం వాడికి ‘చెంచాలా’ గా బ్రతుకుతున్నాడు. కాబట్టి శవాన్ని హరి తరలించుకుపోయేదాకా కావాలని
ఎస్సై చేత అలా జాప్యం చేయించాడు. ఈ చిన్న విషయం గ్రహించడానికి పెద్ద తార్కిక జ్ఞాపకం అక్కర్లేదు... ఇలాంటి వాళ్ళున్న నీ డిపార్టుమెంటు గురించి నువ్వు ఆశావాదాన్ని ప్రకటిస్తావు. సిల్లీగా లేదూ... అప్పారావులాంటి అవినీతిపరులకీ హరిలాంటి హంతకులకు కొమ్ముకాసే వీళ్లు యీ వ్యవస్థను రక్షించే అధికారులు... ఎలా కాపాడగలవ్ నానీని!”.

“చెప్పానుగా” అప్పటికి తేరుకున్నాడు యశస్వి “వాళ్లనే ఓ ట్రిక్ లో ఇరికించి”

“ఇంకా అది సాధ్యమే అనుకుంటున్నావా!”

“ఒక సహాయం చేయగలరా ”

“ఏమిటది?”

“ఇంతవరకూ రాత్రి మీరు ప్రత్యక్షంగా చూసినది నా ఇంటర్వ్యూగా పత్రికల్లో పబ్లిష్ చేయాలి.”

“అంటే”

“ఇప్పుడు మనం స్టేషన్ బయటకి వచ్చాక మీరు యీ కూడల్లో నన్ను అదే నానీని రక్షించాలని మరో జిల్లానుంచి వచ్చిన పోలీసాఫీసరును ఇంటర్వ్యూ చేశారు. దానిలో రాత్రి నేను పోలీసులకి హత్య గురించి ఇన్ఫాం చేసిన దగ్గర్నుంచి, ఇప్పుడు సుందర్ నన్ను బెదిరించిన విషయం దాకా యధాతథంగా పబ్లిష్ కావాలి. అంటే డి ఎస్పీ సుందర్ ఆధ్వర్యంలోనే యీ

హత్య జరిగివుంటుందన్న అర్థం స్ఫురించేలా, నానీకి
ఆశ్రయమిచ్చిన అనసూయ నానీని పరిరక్షిస్తూ ప్రాణాలు విడిచిన విషయాన్ని ప్రజలకి తెలిసేలా రాయాలి.''

``వ్వాట్'' విభ్రమంగా చూశాడు రామసూరి.

""ఒక పోలీసాఫీసర్ అయిన నువ్వు మరో పెద్ద అధికారి గురించి ముఖ్యంగా మీ డిపార్టుమెంటు గురించి ఇంటర్వ్యూలో చెప్పినట్టు రాయాలా! ఏం- ఉద్యోగం మీద ఆశలేదా!''.

``నాకిప్పుడున్నది నానీని రక్షించాలనే ఆశయం మాత్రమే ఐ కేర్ పిన్ ఇఫ్ ఐ లూజ్ మై జాబ్.''

``అంతటితో కథ ముగిసిపోదు యశస్వీ. ఒకనాడు కక్షగట్టి నన్ను జైలుకి పంపిన మీ డిపార్టుమెంటు తన ప్రతిష్ఠ కాపాడుకోవడం కోసం నిన్ను సమిధను చేస్తుంది.''

``సిద్ధంగా వున్నాను''

``అదికాదు యశస్వీ, సుందర్ కీ ఈ హత్యకి లంకెపెట్టి నువ్వెందుకు శత్రువుగా మారబోతున్నావో
నువ్వూహించలేవు....''

``తప్పదు రామసూరిగారూ.... నానీని వెంటాడుతున్న గేంగ్స్‌కి డి.ఎస్పీ. సుందర్ అండ వుందని ఎస్టాబ్లిష్ చేస్తే తప్ప అతని వేగం తగ్గదు. నానీకి నిజం రక్షణ ఉండదు''
సాలోచనగా అన్నాడు ``ఇపుడు ఇది పత్రికలదాకా వెళితే ఆనక అది ప్రజలదాకా, ప్రభుత్వందాకా పాకుతుంది.... అప్పుడు నేను బలి కావచ్చేమో కాని అంతకన్న ముందు
సుందర్ కంగారు పడతాడు. దానితో డిపార్టుమెంటులో వచ్చే వత్తిడిలో నానీని వెంటాడే వ్యక్తులతో తనకు సంబంధం లేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత అతడిదవుతుంది.
ముఖ్యంగా అనసూయ హత్య జరిగింది అతడి సమక్షంలోనే అన్న పాయింట్‌ని జాగ్రత్తగా కవర్ చేస్తే ఇప్పుడు నానీని సురక్షితంగా పట్టుకుని తన నిర్దోషిత్వాన్ని పై అధికారులకీ, ప్రజలకీ చెప్పాల్సిన అవసరం ఏర్పడుతుంది.''

``కాని ఒక వేళ నానీని కాపాడి ఇదంతా అదే సుందర్ తాలూకా ఇన్వాల్వ్‌మెంటు కాదని నిరూపిస్తే''.

``నేను ఇచ్చిన స్టేట్‌మెంట్ అబద్ధమని తేలుతుంది కాని ఆ అబద్ధమే నానీ అనే ఓ నిజాన్ని రక్షించిందీ అవుతుంది'' స్థిరంగా అన్నాడు యశస్వి.

``కాని నానీని కలవని నువ్వు ఈ వాస్తవాన్ని ఎలా తెలుసుకున్నావని నిన్ను నీ యంత్రాంగమే నిలదీస్తే ఏం జవాబు చెబుతావు?'' అడిగాడు చివరిగా.

``అలాంటి ప్రశ్న ఉత్పన్నం కాకుండా జాగ్రత్తగా మరో పథకం వేస్తాను. నా ఇంటర్వ్యూతో డి.ఎస్పీ. సుందర్ ఇరుక్కుంటే అప్పుడు వేయబోయే పథకంలో సరాసరి హోం మినిష్టర్ అప్పారావు చిక్కుకుంటాడు.''

ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టుగా అపారమైన అనుభవం గల రామసూరికి ఆ మరో పథకమేమిటో మింగుడు పడలేదు.... "వెల్.... నీ ఇంటర్వ్యూ నానీని హతమార్చే ప్రయత్నంలో అనసూయ హత్య చేయబడిందా..... అందులో డి.ఎస్పీ. సుందర్ పాత్ర ఎంత అన్న మకుటంతో ఈ రోజు సాయంకాలం పత్రికలో మార్కెట్‌కి వస్తుంది.... వాతవరణం వేడెక్కి నానీని పరోక్షంగా ప్రత్యర్థులైన అందర్నీ ఉలిక్కిపడేటట్టు చేస్తుంది
నువ్వు మాత్రం జాగ్రత్తగా వుండాలి."

"నా గురించి దిగులు పడకండి..... ఇప్పుడు రిస్కు తీసుకుంటున్న మీరు జాగ్రత్తగా వుండాలి" నవ్వాడు యశస్వి.

"ఈ ఆధారంతో నిన్ను నేను కాపాడుకోగలను యశస్వీ" జేబులోని చిన్న లైటర్ లాంటి పాకెట్ రికార్డర్‌ను తీసి చూపించాడు రామసూరి. "ఆశ్చర్యపోకు..... ఇందాక నీ ప్రశ్నలూ, సాగర్, సుందర్‌ల జవాబులూ, నిన్ను నిలదీయడాలు అన్నీ రికార్డయ్యాయి."